క్లుప్తంగా

ముగిసిన వార్షిక బ్రహ్మోత్సవాలు



తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చల సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం పుష్పోత్సవ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. వైఖానస ఆగమ పండితులు ఎంజీఎల్ రఘురామ్, వేదాంతం నాగమారుతీ, ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచర్ల శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో వైదిక క్రతువు నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. శ్రీలక్ష్మి కూచిపూడి నృత్య కళా ఖండం ప్రిన్సిపల్ వెంకటలక్ష్మి శిష్య బృందం చేసిన నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక కుటుంబ సభ్యులు ఎస్‌బీ శివ దంపతులు, నిఖిల్ శాండిల్యా దంపతులు, కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి దంపతులు, దాతలు గుడివాడ బాలకృష్ణ దంపతులు, గుంటి వెంకట్ దంపతులు, మూర్తి వెంకటేశ్వరరావు దంపతులు, జంధ్య రామారావు దంపతులు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు అనురాధ, సంకీర్తన సేవా సమితి అధ్యక్షులు కిరణ్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

ఎగసిన మంటలు.. తప్పిన ప్రమాదం



తాడేపల్లి రూరల్ : మంగళగిరి ప్రకాశం బ్యారేజ్ పాత జాతీయ రహదారి వెంబడి పోలకంపాడు వద్ద ఉన్న హెచ్‌బీ పెట్రోల్ బంక్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సోమవారం మంటలు చెలరేగాయి. గుర్తుతెలియని వ్యక్తులు అక్కడ ఎండిపోయిన పిచ్చి మొక్కలకు నిప్పు పెట్టడంతో భారీగా మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన పెట్రోల్ బంక్ సిబ్బంది మంటలు బంక్ వైపు వ్యాపించకుండా పైపుల ద్వారా నీరు చల్లారు. ఎంతకూ మంటలు అదుపులోకి రాకపోవడంతో అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని, ఎగిసిపడుతున్న మంటలను అదుపుచేశారు. సుమారు 2 గంటల సేపు మంటలను అదుపులోకి తెచ్చినట్లు సిబ్బంది తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు పాటించాలి



ఫిరంగిపురం: వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించడం ద్వారానే వడ దెబ్బకు గురికాకుండా ఉండొచ్చని వైద్యురాలు ఎస్తేరురాణి అన్నారు. 113 త్యాళ్లూరు గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. 234 మందికి వైద్య పరీక్షలు చేసి, నెలకు సరిపడా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ సాగర్‌రాణి, ఏఎన్‌ఎం సరోజ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా అందజేత

ఫిరంగిపురం: నుదురుపాడు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రంథాలయానికి 1986–87 పదో తరగతికి పూర్వవిద్యార్థులు షేక్.నూర్ అహ్మద్, వై. అంజనాదేవి బీరువాను అందజేసినట్లు హెచ్‌ఎం ఇమ్మానియేల్ సోమవారం తెలిపారు. పాఠశాలలో పూర్వవిద్యార్థులను పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ డి.నాగిరెడ్డి, సర్పంచ్ జి.నాగమల్లేశ్వరీ అభినందించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని రేవేంద్రపాడు, సీతానగరం బకింగ్‌హామ్ కెనాల్ కరకట్ట వెంబడి మెల్లెంపూడి వద్ద జరిగిన ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. తాడేపల్లి ఎస్‌ఐ రమేష్ వివరాల మేరకు.. మెల్లెంపూడికి చెందిన కుర్రే శ్రీనివాస్‌రెడ్డి, ఈదులమూడి ప్రసాదరావు (56) ద్విచక్ర వాహనంపై రేవేంద్రపాడు వెళ్లి వస్తుండగా అదుపు తప్పి కిందపడ్డారు. ఈ నెల 22న జరిగిన ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి చేర్పించారు. చికిత్స పొందుతూ ఈదులమూడి ప్రసాదరావు మృతి చెందాడు.

ప్రతి గడపకు వెళ్లి ఓటడిగే అర్హత, హక్కు నాకే ఉన్నాయి

- జగన్‌ను, నన్ను ఆశీర్వదించమని కోరతాను
- ఆయారామ్, గయారామ్‌లకు ఇక ఫుల్‌స్టాపే
- భారీ మెజార్టీతో విజయం సాధిస్తాం
- ఎన్నికల ప్రచారానికి శంఖం పూరించిన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్



ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుడుతూ శంఖం ఊదుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలో సంక్షేమం అందించిన ప్రతి గడపకు వెళ్లి ఓటు అడిగే అర్హత, హక్కు తనకు మాత్రమే ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. విశేషమైన మాఘ బహుళ విదియ రోజైన సోమవారం నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి ఆయన సమర శంఖం పూరించారు. ఆయన సతీమణి పుష్ప, కుమారులు అన్నాబత్తుని సత్యనారాయణ, అఖిల్ గణేష్, వైఎస్సార్‌సీపీ కుటుంబసభ్యులు ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు.

శివకుమార్ మాట్లాడుతూ జిల్లాలో, రాష్ట్రంలోనే తెనాలి నుంచి అత్యధిక మెజార్టీ వచ్చేలా చేస్తామన్నారు. రాష్ట్రంలో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చినంత సంక్షేమాన్ని దేశంలో మరే ప్రభుత్వం, సీఎం కూడా ఇవ్వలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో 82 శాతం పేద, మధ్యతరగతి కుటుంబాలకు సంక్షేమం ఇచ్చి, ఈరోజు మళ్లీ ఓటు వేయమని అడుగుతున్నట్లు చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌ను, తననూ ఆశీర్వదించమని కోరతామని చెప్పారు. 2024 ఎన్నికలతో ఆయారామ్, గయారామ్‌లకు తెనాలిలో శాశ్వతంగా ఫుల్‌స్టాప్ పెట్టబోతున్నామని అన్నారు.

■ నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు మాట్లాడుతూ విశేషమైన రోజున తెనాలిలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ఎన్నికల ప్రచారాన్ని ఆరంభించటం శుభసూచకమన్నారు. ప్రజలు, పార్టీ వర్గాల నుంచి మంచి స్పందన కనిపిస్తోందని, గతానికి మించిన భారీ మెజార్టీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

■ తొలుత స్థానిక గంగానమ్మపేటలోని గంగమ్మ తల్లి ఆలయంలో ఎమ్మెల్యే శివకుమార్, పుష్ప దంపతులు, కుమారులు సత్యనారాయణ, అఖిల్‌గణేష్ ప్రత్యేక పూజలు చేశారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు వీరికి ఘనస్వాగతం పలికారు. అక్కడే ఎమ్మెల్యే శివకుమార్ శంఖం పూరించి ఎన్నికల ప్రచారానికి నాంది పలికారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నాలాది ప్రభాకర్ రూపొందించిన 'వార్ వన్‌సైడే' ఆడియో పాటను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అక్కడ నుంచి అయితానగర్ చేరుకుని శివాలయంలో పూజలు చేశాక, పేరంటాలమ్మను దర్శించుకున్నారు.

■ ఆ తర్వాత ఎమ్మెల్యే సతీమణి పుష్ప, చిన్న కుమారుడు అఖిల్ గణేష్‌లు 2వ వార్డులో లాంఛనంగా ప్రచారాన్ని ప్రారంభించారు. దీనికి ముందు ఎమ్మెల్యే పెద్దకుమారుడు సత్యనారాయణ శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత రూరల్ మండలం తేలప్రోలు గ్రామానికి వెళ్లి, ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక రమేష్, వైస్ చైర్‌పర్సన్ అత్తోట నాగవేణి, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పార్టీ పట్టణ అధ్యక్షులు మద్దాళి శేషాచలం, షేక్ దుబాయ్‌బాబు, రూరల్ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ నేతలు మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, ప్రసాదం బాలగురవమ్మ, దేసు శ్రీనివాసరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, తాడిబోయిన రమేష్, కాకి దేవసహాయం, గోల్డ్ రహీమా, అత్తోట చంటి, కొమ్ము రాయల్, కొల్లా గురునాధ గుప్త, తాడిబోయిన బుచ్చిరాజు, కుక్కల ముక్తేశ్వరరావు, బండ్లమూడి భాస్కరావు, పోతావఝుల పురుషోత్తమశర్మ, చింకా సురేష్, పెసర్లంక రమణ, భాస్కరుని లక్ష్మీనారాయణ, షేక్ మీరావలి, బొల్లినేని బుజ్జి, దేవరపల్లి కిశోర్, మేకల రవికుమార్, శానంపూడి రఘురామరెడ్డి, పెచ్చింగ్ సుభాని, అత్తోట చంటి, కాళిదాసు సత్యం, యలవర్తి సాంబశివరావు, కొలకలూరి నాగేశ్వరరావు, సయ్యద్ గఫూర్, సయ్యద్ గ్యాస్ సుభాని, కాళిదాసు వెంకటేశ్వరరావు, కోలా వాసు, పినపాటి అనిల్, నాగసరపు కృష్ణ, మున్సిపల్ కౌన్సిలర్లు తోట రఘురాం, దాసరి వీరవసంతరావు, పేరం సంజీవరెడ్డి, కొమరాబత్తుని జయపాల్, యాతాటి అనిల్, మొగల్ అహ్మద్‌బేగ్, వీర్లపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజి బాధిత రైతులకు న్యాయం చేయాలి

పసుపు రైతుల ధర్నాలో రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు



సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌తో రైతు సంఘ నేతలు

తెనాలి: దుగ్గిరాలలోని శుభం మహేశ్వరి కోల్డ్‌స్టోరేజిలో అగ్నిప్రమాదం సంభవించి నెలరోజులు దాటినా ప్రభుత్వం, యాజమాన్యం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవటం బాధాకరమని ఆంధ్రప్రదేశ్ పసుపు రైతుల సంఘం రాష్ట్ర కన్వీనర్ జొన్న శివశంకరరావు అన్నారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం జరిగిన పసుపు రైతుల ధర్నానుద్దేశించి ఆయన మాట్లాడారు. కోల్డ్ స్టోరేజి అగ్ని ప్రమాద ఘటనలో రైతులకు నష్టపరిహారం చెల్లించటంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని ఖండిస్తూ మార్చి ఒకటో తేదీ నుంచి జరగనున్న రిలే దీక్షల్లో రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య మాట్లాడుతూ రైతులకు రూ.100 కోట్లు నష్టం వాటిల్లినా కమిటీ నివేదిక పేరుతో ప్రభుత్వం కాలయాపన చేయటం శోచనీయమన్నారు. ఉద్యమాలతోనే రైతు సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి..

అనంతరం స్పందన సమావేశంలో సబ్ కలెక్టర్ ప్రఖర్‌జైన్‌ను కలిసి పసుపు రైతుల కష్టాలను వినిపించారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు త్వరితగతిన న్యాయం చేయాలని కోరారు. రేపల్లె మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకటసుబ్బయ్య, బాపట్ల జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు వేములపల్లి వెంకటరామయ్య, వివిధ సంఘాల నాయకులు ములకా శివసాంబిరెడ్డి, కళ్లం రాజశేఖరరెడ్డి, ఈదర పూర్ణచంద్, ముద్దన సాంబశివరావు, సీఐటీయూ నాయకులు కేబీ ప్రసాద్, షేక్ హుస్సేన్‌వలి, వై.బ్రహ్మేశ్వరరావు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలు నమ్మవద్దు

మున్సిపల్ కమిషనర్ శేషన్న



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో పురపాలక సంఘం సరఫరా చేసే రక్షిత మంచినీరు కలుషితమైందని పలువురు అసత్య ప్రచారాలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. పట్టణంలోని చెంచుపేట, అమరావతి ప్లాట్స్ ఏరియాలో సోమవారం ఆయన పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులు పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని డీ అండ్ వో ట్రేడ్ లైసెన్స్‌లు వ్యాపారులు వెంటనే రెన్యువల్ చేయించుకోవాలని సూచించారు. అలా చేయించుకోని వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అలాగే ఆయా ప్రాంతాల్లో నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

తుది మెరుగులు దిద్దుకుంటున్న తెనాలి బండ్

- నేడు రాజకీయ ప్రముఖుడు రామాచార్యులు విగ్రహావిష్కరణ
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి



తెనాలి బండ్‌పై ఆవిష్కరించనున్న రామాచార్యులు విగ్రహం



జరుగుతున్న ఫ్లోరింగ్ నిర్మాణ పనులు

తెనాలిఅర్బన్: తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సారథ్యంలో తెనాలి పట్టణంలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న తెనాలి బండ్ నిర్మాణ పనులు చివరి దశకు చేరాయి. తెనాలి నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన రహదారి చివర దీనిని ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మంగళవారం బీజేపీ నేత రామాచార్యులు విగ్రహాన్ని త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి, తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌లు ఆవిష్కరించనున్నారు.

■ తెనాలి పట్టణంలోని వీఎస్‌ఆర్ కళాశాల ఎదురుగా ఉన్న నాలుగు లైన్ల రహదారి ప్లాట్‌ఫాంపై తెనాలి బండ్‌ను నిర్మించాలని ఎమ్మెల్యే శివకుమార్ భావించారు. అందులో భాగంగా సుమారు రూ.2.50 కోట్ల నిధులను ప్రభుత్వం నుంచి తెచ్చారు. 2021 చివర్లో నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం పనులు ప్రారంభించి విగ్రహాల ఏర్పాటుకు దిమ్మెల నిర్మాణాలు పూర్తి చేసి టైల్స్ వేశారు. అలాగే ఫ్లోరింగ్‌కు టైల్స్ వేస్తున్నారు. టైల్స్ పనులు పూర్తి కాగానే విగ్రహాల దిమ్మెల వద్ద విద్యుత్ దీపాలు, గ్రీనరీ ఏర్పాటు వంటి పనులు చేయనున్నట్లు మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

మహనీయుల విగ్రహాల ఏర్పాటుకు చర్యలు..

తెనాలి పట్టణాన్ని కళలకు కాణాచిగా పిలుస్తారు. ఎందరో ప్రముఖ కవులు, కళాకారులు, సాహితీ వేత్తలు జన్మించిన గడ్డ తెనాలి. అలాగే ఎందరో ప్రముఖ రాజకీయ నాయకులు ఇక్కడ జన్మించిన వారే. స్వాతంత్ర్య సమరంలో తెనాలికి కీర్తిని తీసుకొచ్చిన ప్రముఖులు ఇక్కడ లేకపోలేదు. వీరందరిని స్మరించుకోవాలని, అలాగే వారి కీర్తిని మరింత ఇనుమడింపజేయాలనే ఉద్దేశంతో ఎమ్మెల్యే శివకుమార్ ప్రముఖల విగ్రహాల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకున్నారు.

నేడు తొలి విగ్రహం ఆవిష్కరణ..

తెనాలి బండ్‌పై నిర్మించిన దిమ్మెలపై ప్రప్రథమంగా బీజేపీ నేత టి.రామాచార్యులు విగ్రహాన్ని మంగళవారం ఆవిష్కరించనున్నారు. రామాచార్యులు కుటుంబ సభ్యులు విగ్రహాన్ని తయారు చేయించి దిమ్మెపై ఏర్పాటు చేశారు. అలాగే దిమ్మె వద్ద మెట్లను ఏర్పాటు చేశారు. మంగళవారం దానిని ఆవిష్కరించేందుకు త్రిపుర రాష్ట్ర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డి తెనాలి రానున్నారు. ఉదయం 10 గంటలకు ఎమ్మెల్యే శివకుమార్‌తో కలిసి త్రిపుర గవర్నర్ విగ్రహాన్ని ఆవిష్కరించనున్నారు. కార్యక్రమంలో పలువురు బీజేపీ నాయకులు, పుర ప్రముఖులు పాల్గొననున్నట్లు రామాచార్యులు తనయుడు టి.అనంతాచార్యులు తెలిపారు. మిగిలిన విగ్రహాలు తయారీ దశలో ఉన్నాయి. అవి పూర్తి కాగానే వాటిని కూడా ఆవిష్కరించనున్నారు.

ఏ రూపంలో ఉన్నా అశ్లీలతను ప్రతిఘటించాలి

'కామోత్సవ దహనం' పుస్తకావిష్కరణలో కొత్తపల్లి రవిబాబు



పుస్తకాన్ని ఆవిష్కరించిన రవిబాబు, పక్కన ఈదర గోపీచంద్, బీరం సుందరరావు

తెనాలి: అశ్లీలత అనేది ఏ రూపంలో ఉన్నా తీవ్రంగా ప్రతిఘటించాల్సిన ఆవశ్యకత ఉందని అశ్లీలతా ప్రతిఘటన వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు, 'ప్రజాసాహితి' ప్రధాన సంపాదకుడు కొత్తపల్లి రవిబాబు పేర్కొన్నారు. అభ్యుదయ రచయితల సంఘం, అశ్లీలతా ప్రతిఘటన వేదిక సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటైన సభకు ఆయన అధ్యక్షత వహించారు. వేదిక వ్యవస్థాపకుడు ఈదర గోపీచంద్ సంపాదకత్వంలో వచ్చిన 'కామోత్సవ దహనం' పుస్తకాన్ని ఆవిష్కరించారు. సభలో మాట్లాడుతూ 1987 ప్రాంతంలో ప్రముఖ కవి గుంటూరు శేషేంద్రశర్మ రచించిన కామోత్సవ్ రచన వారపత్రికలో ధారావాహికంగా వచ్చిందని రవిబాబు చెప్పారు. కామోత్సవ్ రచన అశ్లీలమని, దాన్ని వ్యతిరేకిస్తూ వ్యాసాలు రాసినందుకు తమపై కేసులు నమోదుచేశారనీ, అయినప్పటికీ అవి వీగిపోయినట్టు గుర్తు చేసుకున్నారు. ఈదర గోపీచంద్ మాట్లాడుతూ అప్పట్లో వారపత్రికలో వచ్చిన రచనను ప్రస్తుతం నవల రూపంలో తీసుకొచ్చారని, దీనిలో ఉన్న అశ్లీలతపై మళ్లీ హెచ్చరించాల్సిన బాధ్యత తమపై పడిందన్నారు. అందుచేతతో కామోత్సవ్‌పై రాష్ట్రస్థాయి ఏడేళ్లపాటు సాగిన న్యాయ, ప్రజా, సాహితీ పోరాటాల సచిత్ర చరిత్ర, వ్యాసాలు, దినపత్రికలో వచ్చిన అంశాలను క్రోడీకరించి 'కామోత్సవ దహనం' పేరుతో పుస్తకంగా తీసుకొచ్చినట్టు వివరించారు. ఫిబ్రవరి 26 అశ్లీలతా ప్రతిఘటన వేదిక ఆవిర్భావ దినోత్సవం రోజు ఆవిష్కరించినట్లు చెప్పారు. రచయిత, వేదిక రాష్ట్ర కార్యదర్శి బీరం సుందరరావు తన ప్రసంగంలో సెల్‌ఫోన్‌తో అందుబాటులోకి వస్తున్న అశ్లీల చిత్రాలు యువతను పెడత్రోవ పట్టిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అరసం గుంటూరు జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు, విశ్రాంత ప్రొఫెసర్/ రచయిత బి.లలితానంద ప్రసాద్, ఏఐటీయూసీ సీనియర్ నేత పరుచూరి వెంకటేశ్వరరావు, రచయితలు కె.నారాయణమూర్తి, అయినాల మల్లేశ్వరరావు మాట్లాడారు.

ఈవీఎంల పరిశీలన

ఫిరంగిపురం: రేపూడి మార్కెట్ యార్డు గోడౌనులోని ఈవీఎంలను ఆర్డీవో శ్రీకర్ సోమవారం పరిశీలించారు. సెక్యూరిటీ సిబ్బంది రిజిస్టర్, సీసీ కెమారాల పనితీరును గురించి సిబ్బందిని ప్రశ్నించారు. విద్యుత్ సరఫరా, ఇన్వర్టర్ పనితీరు పరిశీలించారు. ఆయన వెంట డీటీ రాజా రమేష్, వీఆర్వో శివకోటేశ్వరరావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

క్రైమ్ కార్నర్

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

తెనాలిరూరల్: రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన భట్టిప్రోలు స్టేషన్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 50 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి భట్టిప్రోలు స్టేషనులో రైలు కింద పడి ఆదివారం అర్ధరాత్రి దాటాక మృతి చెందాడు. సోమవారం సమాచారం అందుకున్న తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలుస్తోందని పోలీసులు తెలిపారు.

మహిళపై దాడి

తెనాలిరూరల్: అక్రమంగా ఇంట్లోకి చొరబడడమే కాకుండా మహిళపై దాడి చేసిన వ్యక్తి మీద కేసు నమోదైంది. రూరల్ ఎస్ఐ పి.కోటేశ్వరరావు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని నందివెలుగుకు చెందిన కోలాటి మల్లేశ్వరి ఇంట్లోకి అదే గ్రామానికి చెందిన బదిరి జయశేఖర్ ఆదివారం రాత్రి అక్రమంగా చొరబడ్డాడు. ఇంట్లోని సామాను ధ్వంసం చేయడమే కాకుండా వివాహితతో ఘర్షణ పడి ఆమెపై దాడి చేసి గాయపర్చాడు. బాధితురాలు సోమవారం పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

బాపట్ల యువకుడిపై నాన్‌బెయిలబుల్ వారెంట్

తెనాలిరూరల్: బాపట్లకు చెందిన యువకుడిపై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది. తెనాలి జీఆర్పీ స్టేషన్‌కు సంబంధించిన కేసు 111/15లో బాపట్ల రాజీవ్ నగర్‌కాలనీకి చెందిన దండమూడి ఏసోబు అలియాస్ కుమ్మరిగుంట ఏసోబు ముద్దాయిగా ఉన్నాడు. ఇతను ఆచూకీ లేకుండా పోవడం, కోర్టు వాయిదాలకు హాజరుకాకపోతుండడంతో న్యాయస్థానం నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసిందని జీఆర్పీ ఎస్ఐ ఎల్.సరస్వతి సోమవారం తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరులో సంప్రదించాలన్నారు.

సీఎంగా జగన్‌ను మళ్లీ ఎన్నుకుందాం

- జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్ ప్రారంభోత్సవం



సచివాలయం-2ను ప్రారంభిస్తున్న జెడ్పీ చైర్ పర్సన్ హెనీక్రిస్టినా, ఎమ్మెల్యే శివకుమార్

కొల్లిపర: జరుగుతున్న అభివృద్ధిని, అందుతున్న సంక్షేమాన్ని ప్రతి ఒక్కరూ గమనించాలని, రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించాలని జెడ్పీ చైర్ పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా విజ్ఞప్తి చేశారు. సోమవారం మండల కేంద్రమైన కొల్లిపర గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌తో కలసి ఆమె రూ.38 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం-2, రూ.20 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌ను ప్రారంభించారు. ఎంపీడీవో విష్ణుప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సచివాలయం, వైఎస్సార్ విలేజ్ క్లినిక్, ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి పరిపాలనను ప్రజల వద్దకు తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 872 గ్రామ సచివాలయాలు నిర్మాణాలు పూర్తిచేసినట్లు, సుమారు 7 వేల మంది వలంటీర్ల ద్వారా 500 ప్రభుత్వ సేవలు నిత్యం పేదవారికి ఇంటి ముంగిటే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి సంక్షేమం అందిస్తున్న ప్రభుత్వాన్ని రెండు నెలల్లో జరిగే ఎన్నికలలో ఎమ్మెల్యే శివకుమార్‌ను అఖండ మెజార్టీతో గెలిపించి, జగనన్నను మరలా ముఖ్యమంత్రిగా చేసుకోవాలని కోరారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థతో సాకారం చేశారని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో దుగ్గిరాల మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎన్నికల పరిశీలకులు శేషగిరి, ఎంపీపీ భీమవరపు పద్మావతి, సర్పంచ్ పిల్లి రాధిక, వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్ భీమవరపు శివకోటిరెడ్డి, ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, ఎంపీటీసీలు కె.శ్రీలత, ఝాన్సీ, జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నల శివారెడ్డి, పార్టీ నాయకులు కళ్ళం వీరారెడ్డి, నెర్ల కుటుంబ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కన్నెగంటి హనుమంతుకు ఘన నివాళి



గుంటూరు మెడికల్: స్వాతంత్ర్య సమర యోధుడు కన్నెగంటి హనుమంతు సేవలు ఎంతో విలువైనవని అహల్య ట్రస్టు నిర్వాహకులు, ఐవీఎఫ్ స్పెషాలిటీ వైద్య నిపుణురాలు డాక్టర్ శనక్కాయల రాజకుమారి అన్నారు. కన్నెగంటి హనుమంతు వర్ధంతి సందర్భంగా సోమవారం చుట్టుగుంట సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.